
సాక్షి
బాపట్ల
శుక్రవారం । 12 । ఏప్రిల్ । 2024



సాయుధ బలగాల కవాతు

పెదకూరపాడు: మండలంలోని పరస గ్రామంలో ఎస్‌ఐలు విపర్ల వెంకట్రావు, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ బలగాలు గురువారం కవాతు నిర్వహించాయి.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 510.30 అడుగుల వద్ద ఉంది. కుడికాలువకు 5,292, ఎస్‌ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.

వైఎస్సార్‌సీపీ కార్యాలయం ప్రారంభం



తెనాలి: జగ్గడిగుంటపాలెంలో సర్పంచ్ కె.బాలాజీ ఆధ్వర్యంలో ఏర్పాటైన వైఎస్సార్‌సీపీ ఎన్నికల కార్యాలయాన్ని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ గురువారం సాయంత్రం ప్రారంభించారు.

న్యూస్‌రీల్

హైకోర్టు న్యాయమూర్తి మల్లికార్జునరావుకు సన్మానం



దాచేపల్లి: హైకోర్టు న్యాయమూర్తి తెల్లాప్రగడ మల్లికార్జునరావుని గురువారం సన్మానించారు. పలు దేవాలయాల దర్శనానికి వచ్చిన ఆయన నారాయణపురం ఆర్‌అండ్‌బీ బంగ్లాలో ఆగారు. సీనియర్ సివిల్ జడ్జి శేషాద్రి, జిల్లా జడ్జి గాజుల వెంకటేశ్వర్లు, గురజాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మందపాటి శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షుడు బండి వీరభద్రుడు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది చల్లా రామిరెడ్డి, న్యాయవాదులు జక్కా చెన్నకేశవరావు, ఎనుముల నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయశాస్త్ర సర్టిఫికెట్ కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానం

గుంటూరుఎడ్యుకేషన్: వావిలాల గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో గ్రంథాలయ శాస్త్ర సర్టిఫికెట్ కోర్సులో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలని సంస్థ ప్రిన్సిపాల్ డి.రాంబాబు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులై 18 ఏళ్ల వయసు నిండిన అభ్యర్థులు కోర్సులో చేరేందుకు అర్హులని తెలిపారు. డిగ్రీ విద్యావంతులు గ్రంథాలయ శాస్త్ర సర్టిఫికెట్ కోర్సుకు అర్హులేనని, కోర్సు తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో ఉంటుందని వివరించారు. దరఖాస్తు కోసం గుంటూరు అరండల్‌పేట 12/3లోని సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. వివరాలకు 93962 38946 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

గోగులమ్మ అమ్మవారిని తాకిన సూర్య కిరణాలు



పెదపులివర్రు(భట్టిప్రోలు): మండలంలోని పెదపులివర్రు గ్రామ దేవత శ్రీ గోగులమ్మ అమ్మవారిని గురువారం ఉదయం సూర్య భగవానుని కిరణాలు తాకాయి. అమ్మవారి ముఖ వర్చస్సును ఉదయం 6:55 గంటల నుంచి 7:15 వరకు తాకాయి. ప్రతి ఏటా చైత్ర మాసం ఆరంభమైన మూడో రోజు నాటి నుంచి అమ్మవారిని ప్రత్యక్ష సూర్యనారాయణుడు తాకుతారు. భక్తులు అధిక సంఖ్యలో ఈ దృశ్యాన్ని తిలకించేందుకు వచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారికి ప్రాతః కాలంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేకాలు చేశారు.

నేడు అద్దంకి బ్రాంచ్ కెనాల్‌కు సాగర్ జలాలు విడుదల

శావల్యాపురం: తాగునీటి అవసరాల నిమిత్తం సాగర్ జలాలను ప్రభుత్వం విడుదల చేస్తున్నట్లు ఎన్నెస్పీ డీఈ చాట్రగడ్డ రామారావు చెప్పారు. ఇటీవల సాగర్ జలాశయం నుంచి తాగునీటి అవసరాల నిమిత్తం 5,500 క్యూసెక్కులు విడుదల చేసినట్లు చెప్పారు. శుక్రవారం నుంచి అద్దంకి బ్రాంచ్ కెనాల్‌కు 900 క్యూసెక్కులు విడుదల చేస్తామని, అందులో భాగంగా ఈనెల 16 వరకు అన్నీ మేజరు కాల్వలు పూర్తిస్థాయిలో మూతవేసి ప్రకాశం జిల్లా పరిధిలో గ్రామాలకు 900 క్యూసెక్కులు విడుదలయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈనెల 17 నుంచి పల్నాడు జిల్లా అద్దంకి బ్రాంచ్ కెనాల్ పరిధిలో ఉన్న 25 తాగునీటి చెరువులన్నీ సాగర్ జలాలతో నింపుతామన్నారు. నీటిని వృథా చేయరాదని ఆయన సూచించారు. ముఖ్యంగా చేపల చెరువులకు వినియోగిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నెస్పీ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ అధికారులు సమన్వయంతో గ్రామాల్లోని చెరువులతోపాటు వాగులు, కుంటలను నూరుశాతం నింపాలని ఆదేశించారు. సాగర్ జలాలు కేవలం తాగునీటి అవసరాల నిమిత్తం విడుదల చేస్తున్నామని తెలిపారు.

నిమ్మకాయల ధరలు



తెనాలి టౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.5800, గరిష్ట ధర రూ.7200, మోడల్ ధర రూ.6600 వరకు పలికింది.

గుంటూరు సిద్ధం

- పల్నాడులో జన నీరాజనం
- నేడు గుంటూరులో మేమంతా సిద్ధం సభ
- ఏర్పాట్లు పూర్తిచేసిన నేతలు
- తరలిరానున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు



గుంటూరులో సభ ఏర్పాట్లు పరిశీలిస్తున్న రీజనల్ కో ఆర్డినేటర్ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, మంత్రి రజిని, ఎంపీ అభ్యర్థి కిలారి, ఎమ్మెల్యే సుచరిత, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, అభ్యర్థులు అంబటి, నూరి ఫాతిమా, బలసాని

సాక్షి ప్రతినిధి, గుంటూరు: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్రకు ఉమ్మడి జిల్లాలో జన నీరాజనం లభిస్తోంది. ఇప్పటికే వినుకొండ, అద్దంకి, నరసరావుపేట, గురజాల, సత్తెనపల్లిలో జైత్రయాత్ర సాగింది. ప్రతిచోటా జనం నీరాజనాలు పలికారు. మండుటెండలో కూడా తమ నాయకుడిని చూసేందుకు మహిళలు, పురుషులు, యువత, అవ్వాతాతలు రోడ్డుకిరువైపులా బారులు తీరారు. పిడుగురాళ్లలో జరిగిన సభకు జనం పోటెత్తారు. వినుకొండ నియోజకవర్గం చింతల చెరువు నుంచి ప్రారంభమైన జైత్రయాత్ర ప్రస్తుతం సత్తెనపల్లి నియోజకవర్గం రాజుపాలెం మండలం ధూళిపాళ్ల వద్దకు చేరుకున్న సంగతి తెలిసిందే. తొలిరోజు యాత్ర నూజెండ్ల, వినుకొండ, శావల్యాపురం మండలాల్లో జరిగి, గంటావారిపాలెం వద్దకు చేరింది. తర్వాత రోజు ఉగాది రావడంతో అక్కడే ముఖ్యమంత్రి బస చేశారు. ఆయనకు వేద పండితులు ఆశీర్వచనం అందించారు. బుధవారం కూడా జనప్రవాహం కొనసాగింది. పల్నాడు రోడ్లు జనసంద్రంగా మారి ఆత్మీయ నేతకు సాదర స్వాగతాన్ని పలికాయి. ఎండ 40 డిగ్రీలు దాటినా లెక్క చేయకుండా గంటావారిపాలెం నైట్ స్టే పాయింట్ వద్ద ఉదయం బస్సు యాత్ర మొదలైనప్పటి నుంచి మేమంతా సిద్ధమంటూ ముఖ్యమంత్రి బస్సుతో పాటు ప్రవాహంలా జనం ముందుకు కదిలారు. సంతమాగులూరు అడ్డురోడ్డు, అన్నవరప్పాడు, రొంపిచర్ల, సంతగుడిపాడు, విప్పర్ల, నకరికల్లు గ్రామాలతోపాటు పిడుగురాళ్ల పట్టణంలో ప్రజలు రోడ్లపైకి వచ్చి బారులు తీరారు. తన కోసం ఎదురు చూస్తున్న జనం కోసం సీఎం బస్సు టాప్‌పై నుంచి అభివాదం చేయడంతోపాటు పలుచోట్ల... బస్సు దిగి నేరుగా అవ్వాతాతలను, అక్కచెల్లెమ్మలను, విద్యార్థులతోనూ ముచ్చటించి వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు అందాయా? లేదా? మీ ఇంటికి చేరాయా? లేదా? అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. పలు అనారోగ్య సమస్యలు ఉన్నవారితో కూడా మాట్లాడి వారి చికిత్సకు అవసరమైన సాయం చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. తమ అభిమాన నేత తమ ముందుకు రావడమే కాకుండా తమకు కొండత భరోసాను అందిస్తుండటంతో ఆయన్ను చూసేందుకు జనం పోటెత్తుతున్నారు.



సిద్ధమైన సభా ప్రాంగణం

ఘనస్వాగతానికి ఏర్పాట్లు

గుంటూరు జిల్లాకు యాత్ర రానుండటంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు స్వాగతం పలికేందుకు గుంటూరు నేతలు సర్వం సిద్ధం చేస్తున్నారు. ఏటుకూరు వద్ద సభకు అన్ని ఏర్పాట్లు చేశారు. గురువారం సాయంత్రం రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, జిల్లా అధ్యక్షులు డొక్కా మాణిక్యవరప్రసాద్, మంత్రి విడదల రజిని, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎంపీ అభ్యర్థి కిలారు రోశయ్య, ఎమ్మెల్యే అభ్యర్థులు బలసాని కిరణ్‌కుమార్, నూరి ఫాతిమా, అంబటి మురళీకృష్ణ, వ్యవసాయ శాఖ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి పరిశీలించారు. అడుగడుగునా ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

బస్సు యాత్ర సాగేదిలా...

సీఎం వైఎస్ జగన్ శుక్రవారం ధూళిపాళ్ల రాత్రి బస నుంచి బయలుదేరుతారు. సత్తెనపల్లి, కొర్రప్రాడు, మేడికొండూరు, పేరేచర్ల జంక్షన్, నల్లపాడు మీదుగా హౌసింగ్ బోర్డు వద్దకు చేరుకుని భోజన విరామం తీసుకుంటారు. అనంతరం చుట్టుగుంట సర్కిల్, వీవీపీ రోడ్ మీదుగా సాయంత్రం 3.30 గంటలకు ఏటుకూరు బైపాస్ సభ ప్రాంగణానికి చేరుకుని బహిరంగ సభలో సీఎం ప్రసంగిస్తారు. సభ అనంతరం తక్కెళ్లపాడు బైపాస్, పెదకాకాని బైపాస్, వెంగళరావునగర్, నంబూరు క్రాస్ మీదుగా నంబూరు బైపాస్ దగ్గర రాత్రి బస శిబిరానికి చేరుకుంటారు.



పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న చిన హనిమిరెడ్డి

ఓటమి భయంతోనే ఎల్లో మీడియా దుష్ప్రచారం

అసెంబ్లీ అభ్యర్థి చిన హనిమిరెడ్డి మండిపాటు

అద్దంకి రూరల్: తాను ఓడిపోతానని భయంతోనే అద్దంకి టీడీపీ అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ ఎల్లో మీడియాతో కలిసి తనపై దుష్ప్రచారానికి పాల్పడుతున్నారని అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి పాణెం చిన హనిమిరెడ్డి మండిపడ్డారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎల్లో మీడియాలో వచ్చిన కథనాన్ని ఆయన ఖండించారు. అద్దంకి ఎమ్మెల్యేగా కలిసి సంవత్సరాల తరబడి నియోజకవర్గ ప్రజలకు కనిపించకుండా పోయిన రవికుమార్ గురించి ఎల్లో మీడియాకు గుర్తుకు రాలేదా? అని ప్రశ్నించారు. ఒక్కరోజు వ్యక్తిగత పనుల కోసం హైదరాబాద్ వెళ్లిన తనపై దుష్ప్రచారాలు చేయటం ఏమిటని? ప్రశ్నించారు. ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాను అనటం సరికాదు.. ఫోన్ కాల్ డేటా కావాలంటే ఇస్తానని తెలిపారు.

బస్సుయాత్ర స్పందన చూసి భయపడ్డారా.. !

సంతమాగులూరు అడ్డ రోడ్ వద్ద బుధవారం జరిగిన ముఖ్యమంత్రి బస్సు యాత్రకు వచ్చిన ప్రజా స్పందన చూసి ఎల్లో మీడియాకు పిచ్చెక్కి ఇలాంటి తప్పుడు వార్తలు రాస్తున్నారని హనిమిరెడ్డి తెలిపారు. ఇక నుంచి తాను ఎక్కడికి వెళ్లాలన్నా ఎల్లో మీడియాకు లీవ్ లెటర్ రాసి పర్మిషన్ తీసుకోవాలా? అని ఎద్దేవా చేశారు. పిచ్చిపిచ్చి రాతలు రాస్తే ఊరుకునేది లేదని ఆయన హెచ్చరించారు. ఎల్లో మీడియా వెనుక టీడీపీ పెద్దలు ఉండి రాయిస్తున్నారని అర్థమవుతోందన్నారు. ఇలాంటి చిల్లర రాజకీయాల వల్ల ఉపయోగం ఉండదని సూచించారు. నియోజకవర్గంలో ప్రజలు తనకు బ్రహ్మరథం పడుతున్న విధానాన్ని చూసి ఎమ్మెల్యే భయపడిపోయారని తెలిపారు. తాను వచ్చిన కొత్తలో ఓడి పోతాడని ప్రచారం చేసిన ఎల్లో మీడియాకు ఇప్పుడు కథ తారుమారు అవటంతో భయం పట్టుకుందన్నారు. రానున్న ఎన్నికల్లో తానేమిటో.. సీఎం జగన్ మోహన్‌రెడ్డి పవర్ ఏంటో గెలిచి చూపిస్తామని చెప్పారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ ఉపాధ్యక్షుడు జ్యోతి హనుమంతరావు, చందోలు రాజ్‌కుమార్, మురహరియాదవ్, కొరిశపాడు వైఎస్సార్ సీపీ నాయకురాలు శ్రీదేవి, అవిశెన ప్రభాకరరెడ్డి, స్థానిక నేతలు పాల్గొన్నారు.



రేపల్లెలో ప్రత్యేక నమాజు చేస్తున్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు, బవుడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు తదితరులు



వేటపాలెంలో ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేయిస్తున్న మత పెద్ద



మార్టూరులో ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఈద్ ముబారక్

రేపల్లె రూరల్ / చీరాల/ బాపట్ల : రంజాన్ పర్వదిన వేడుకల్ని జిల్లాలో ముస్లింలు గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈద్గాల వద్ద ప్రార్థనలు చేశారు. అక్కడ మత పెద్దలు అల్లా సందేశాన్నిచ్చారు. దివ్య ఖురాన్ గ్రంథం ఆవిర్భవించిన రోజునే రంజాన్ పర్వదినాన్ని జరుపుకుంటామని తెలిపారు. అల్లాపై విశ్వాసంతో నిత్యం ఆయన్ను తలుచుకుంటూ నమాజులు చేయాలని బోధించారు. నిత్యం సత్యాన్నే పలకాలని, శాంతియుత జీవితాన్ని అవలంబించాలని చెప్పారు. సంపాదించిన సొమ్ములో కొంత భాగాన్ని పేదల కోసం ఉపయోగించాలని తెలిపారు. ప్రతి ముస్లిం జీవితంలో ఒక్కసారైనా హజ్ యాత్ర చేయాలని చెప్పారు. రేపల్లె పట్టణంలో వివిధ మసీదుల పరిధిలోని ముస్లింలు ర్యాలీగా ఉయ్యూరువారిపాలెం రహదారిలోని ఈద్గాకు చేరుకున్నారు. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు, వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ ఈవూరు గణేష్, బాపట్ల అర్బన్ డెవలప్‌మెంటు అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు తదితరులు ఈద్గాలో ప్రత్యేక నమాజులు నిర్వహించారు. కార్యక్రమంలో ఈద్గా కమిటీ సభ్యులు, ముస్లింలు పాల్గొన్నారు.

సామాజిక ఉద్యమకారుడు జ్యోతిరావు పూలే

కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల: సామాజిక ఉద్యమకారుడిగా చరిత్రలో నిలిచిపోయిన మహనీయులు మహాత్మా జ్యోతిరావు పూలే అని జిల్లా ఎన్నికల అధికారి పి.రంజిత్ బాషా కొనియాడారు. పూలే 198వ జయంతి కార్యక్రమంలో భాగంగా గురువారం కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి కలెక్టర్ పుష్పమాలలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి, చైతన్యానికి ఉద్యమాలు నడిపిన గొప్ప నాయకులు జ్యోతిరావు పూలే అని పేర్కొన్నారు. నేటి యువత ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్. సత్తిబాబు, జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి నర్సారెడ్డి, బీసీ సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.



పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

దేశ సమగ్రత, సౌభ్రాతృత్వాన్ని కాపాడాలి

స్పెషల్ పోలీసు అబ్జర్వర్ దీపక్ మిశ్రా

బాపట్ల: దేశ సమగ్రత, సౌభ్రాతృత్వాన్ని కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పెషల్ పోలీస్ అబ్జర్వర్ దీపక్ మిశ్రా అన్నారు. ఎన్నికల ముందస్తు ఏర్పాట్లు, భద్రత అంశాల్ని పరిశీలించేందుకు బాపట్ల జిల్లాకు వచ్చిన ఆయన్ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం పోలీస్ అధికారులతో దీపక్ మిశ్రా సమీక్ష నిర్వహించారు. ఎన్నికల విధి నిర్వహణలో దేశమాతకు సేవ చేస్తున్నామనే అంకిత భావం, శ్రద్ధ భక్తి ఉండాలని చెప్పారు. ప్రజాస్వామ్య దేశంలో స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాల్సిన బాధ్యత యంత్రాంగంపై ఉందని తెలిపారు. ధర్మం వైపు ధైర్యంతో, న్యాయబద్ధంగా పని చేయాలని ఆయన సూచించారు. ఎన్నికల డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, కౌంటింగ్ కేంద్రాల ప్రణాళికను జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ పి.రంజిత్ బాషా వివరించారు. జిల్లాలో సాధారణ పోలింగ్ కేంద్రాలు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిస్థితుల్ని ఆయన దృష్టికి తెచ్చారు. పలు కేసులలో నేర చరిత్ర ఉన్న వారిని, అల్లర్లు, గొడవలు చేయడానికి అవకాశం ఉన్న రాజకీయ పార్టీలకు చెందిన వారిని బైండోవర్ చేశామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లా సరిహద్దులలో చెక్ పోస్టులు, పోలీస్ భద్రత ఏర్పాట్లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నివేదించారు. సమావేశంలో అడిషనల్ డీజీపీ ఎస్. శంకబ్రత బాగ్చి , సర్వశ్రేష్ఠ త్రిపాఠి, జిల్లా సంయుక్త కలెక్టర్ సీహెచ్. శ్రీధర్, జిల్లా అదనపు ఎస్పీ , డీఎస్పీలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దీపక్ మిశ్రా

నంబర్ వన్ క్రిమినల్ ‘ఆమంచి’

- వైఎస్సార్ సీపీ నేతల ధ్వజం
- 'కరణం'ను విమర్శించే స్థాయి ఆయనకు లేదు

చీరాల: నేర చరిత్ర, దళితులు, బడుగు, బలహీన వర్గాలపై దాడులకు పాల్పడిన మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ నియోజకవర్గంలోనే నంబర్ వన్ క్రిమినల్ అని వైఎస్సార్ సీపీ నాయకులు ధ్వజమెత్తారు. రామకృష్ణాపురంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కోండ్రు బాబ్జి, రూరల్ అధ్యక్షుడు ఆసాది అంకాలరెడ్డి, వేటపాలెం మండల అధ్యక్షుడు బొడ్డు సుబ్బారావు, గుంటూరు మాధవరావు, అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, యాతం మేరిబాబు, బండారు జ్వాలా నరసింహం, మున్సిపల్ వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు మాట్లాడారు. ఆమంచి కృష్ణమోహన్ వైఎస్సార్ సీపీని మోసగించి, రాష్ట్రాన్ని వంచించి కాంగ్రెస్ పార్టీలో చేరాడని తెలిపారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసిన ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ అభ్యర్థిపై కరణం వెంకటేష్‌పై విమర్శలు చేయడం అన్యాయమని ఖండించారు. ఆమంచి జీవితంతో పాటు కుటుంబ చరిత్ర కూడా నేరమయమని చెప్పారు. చీరాలలో రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి ఇసుక దందా నడిపారని ఆరోపించారు. చీరాల నుంచి రోజుకు 200 లారీలు మూడు రాష్ట్రాలకు తరలించి కోట్లు గడించారని తెలిపారు. తెలుగుదేశం పార్టీలో చేరి ఓ సామాజిక వర్గాన్ని దూషించడంతో ఆ పార్టీ ఆమంచి దురాగతాలను బయటపెట్టిందని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అక్కున చేర్చుకుని పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జిగా పంపితే గ్రానైట్, ఇసుక దందా నడిపి రూ.40 కోట్ల మేర దోచుకున్నారని ఆరోపించారు. ఇటువంటి వ్యక్తి కరణం బలరాం, వెంకటేష్‌లను దూషించడం సబబు కాదని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ నాయకులు

హిట్లర్‌లా పరిపాలన

ఆమంచి అధికారంలో ఉన్నప్పుడు నియోజకవర్గంలో హిట్లర్ పరిపాలన సాగించారని, బొగ్గు అమ్ముకుని బతికే కుటుంబం నుంచి రూ. 100 కోట్లు ఎలా సంపాదించారో ప్రజలకు వివరించాలని వైఎస్సార్ నేతలు డిమాండ్ చేశారు. చీరాలకు మెడికల్ కాలేజీ వస్తుంటే రాకుండా అడ్డుకున్న ఘనత ఆమంచిదేనని మండిపడ్డారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే వారిని బెదిరించి ప్రతి వెంచర్‌లో వాటాలు వసూలు చేసిన వ్యక్తి ఆమంచి అని ఆరోపించారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాలో కీలకపాత్ర పోషించారని, ఆయన చేయని అరాచకం లేదని తెలిపారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నేత యాతం ఆనందరావు నిర్మించుకున్న రిసార్ట్‌ను అక్రమంగా పొక్లెయిన్‌తో కూల్చివేయించారన్నారు. ఆర్యవైశ్యులను తనకు ఓటు వేయలేదని దూషించారని తెలిపారు. గనినివారిపాలెంలో ఫ్లెక్సీలు కోశారని, చదువుకుంటున్న యువకులపై అక్రమ కేసులు పెట్టించడమే కాకుండా కరెంటు షాకులు ఇప్పించి వారి జీవితాలను నాశనం చేశారని మండిపడ్డారు. కంది అంజిరెడ్డి ద్వారా ఇసుక టైరు బండ్ల వారి వద్ద డబ్బులు వసూలు చేశారని ఆరోపించారు. ఈపూరుపాలెం స్ట్రయిట్ కట్, సాయికాలనీలో చేనేతల గృహాలను అడ్డుగోలుగా తన అధికారంతో నేలమట్టం చేశారని, చేనేత సొసైటీ పేరుతో హ్యాండ్‌లూమ్ పార్కును కబ్జా చేయాలని చూస్తే తాము కోర్టుకు వెళ్లి నిలుపుదల చేశామని తెలిపారు. వాడరేవు, కటారివారిపాలెం మధ్య గొడవలు సృష్టించి రాజకీయంగా వాడుకుంటున్నారని విమర్శించారు. ఎంపీపీగా తనపై రౌడీషీట్ ఓపెన్ చేశారని గవిని శ్రీనివాసరావు తెలిపారు. ఆర్యవైశ్యుడైన చిన్ని లీలాధరరావుపై అక్రమ కేసులు పెట్టించి రిమాండ్‌కు పంపించారన్నారు. ప్రశ్నించిన విలేకరులపై దాడులు చేసిన ఘనత కూడా ఆమంచిదేనని ధ్వజమెత్తారు. చెత్తాచెదారంతో నిండిపోయిన కుందేరును పార్కుగా నిర్మిస్తే దాన్ని కూడా విమర్శించడం ఆమంచికే దక్కిందని ఎద్దేవా చేశారు. 33 వేల ఓట్లు తొలగించి, రేపల్లె నుంచి సోపిరాల వరకు తమ సామాజికవర్గం వారి ఓట్లు చేర్పించి అడ్డగోలుగా గెలిచిన ఘనత ఆయనదేనని ఆరోపించారు. చివరకు దివంగత నేత వైఎస్సార్ విగ్రహాన్ని సైతం నియోజకవర్గంలో పెట్టకుండా పార్టీ నేతలపై కేసులు బనాయించారన్నారు. ఇటువంటి క్రిమినల్ మనస్తత్వం కలిగి బడుగు, బలహీన వర్గాలను వేధించిన ఆమంచికి 2024 ఎన్నికల్లో చరమగీతం పాడాలని నేతలు పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు కావూరి రమణారెడ్డి, వాసిమళ్ల వాసు, చింతా శ్రీను పాల్గొన్నారు.

క్లుప్తంగా

శాలివాహనుల సంక్షేమానికి ముఖ్యమంత్రి కృషి

రాష్ట్ర శాలివాహన కుమ్మరి కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తమ్

ఫిరంగిపురం: శాలివాహన కుమ్మరుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి ఎనలేనిదని రాష్ట్ర శాలివాహన కుమ్మరి కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తమ్ అన్నారు. మండలంలోని నుదురుపాడులో గురువారం సాయంత్రం శాలివాహన, కుమ్మరుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శాలివాహనుల సంక్షేమం కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేశారని చెప్పారు. రాష్ట్రంలో 6.25 లక్షల మందికి రూ.1,680 కోట్లు లబ్ధి చేకూర్చారని చెప్పారు. కవయిత్రి మొల్ల జయంతిని మార్చి 13న రాష్ట్ర పండుగగా నిర్వహించేలా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారని తెలిపారు. కోటప్పకొండలో శాలివాహనుల అన్నదాన సత్రం ఏర్పాటు చేసేందుకుగాను 50 సెంట్ల స్థలాన్ని కేటాయించారన్నారు. ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ పక్షాన నిలిచి, ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ గెలిపించుకోవాలని కోరారు. సమావేశంలో గ్రామ సర్పంచ్ గొట్టం నాగమల్లేశ్వరి, జి.చౌడయ్య, సీహెచ్ శివకోటి, ఆర్.రాంబాబు, ఆర్.పోతురాజు, ఆర్.పవన్, జి.రవి, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో కుల, మతాలకతీతంగా సంక్షేమం



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న, కోన రఘుపతి, పార్టీ నాయకులు

వైఎస్సార్ సీపీ బాపట్ల ఎమ్మెల్యే అభ్యర్థి కోన రఘుపతి

పిట్టలవానిపాలెం: కుల, మతాలకతీతంగా సంక్షేమం అందించిన ఘనత సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డిదేనని బాపట్ల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి కోన రఘుపతి అన్నారు.మండలంలోని పిట్టువారిపాలెం, జీఎస్‌పాలెం, పిట్టలవానిపాలెం, మంతెన వారిపాలెం, కొత్తపాలెం గ్రామాల్లో గురువారం ఆయన ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్‌తో కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రఘుపతి మాట్లాడుతూ బాపట్ల శాసన సభ్యునిగా తనను మూడో సారి, బాపట్ల ఎంపీగా నందిగం సురేష్‌ను రెండో సారి గెలిపించాలని కోరారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీలు దెందుకూరి సీతారామరాజు, చేబ్రోలు కృపానందం, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా మహిళా అధ్యక్షురాలు యేబ్రు అశ్వినీ రెడ్డి, దబ్బకూటి మాధవరావు, బొలగాని అరుణకుమారి, నర్రా శ్రీనివాసరావు, బోరుగడ్డ ఆదాం, కొర్లపాటి రాజేష్, వెంకటేశ్వరరెడ్డి, బడుగు ప్రకాశరావు, మండే విజయ్‌కుమార్, కూసంపూడి దేవేంద్రరాజు, మంతెన గంగరాజు, గుమ్మడి సీతయ్య, వాలి శివారెడ్డి, ఎనుముల కోటేశ్వరరావు, మాధవి, మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, కుంతం ప్రసన్నరాజు, చేబ్రోలు వీరయ్య , కోటిరెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, బొలగాని సుబ్బారావు, సురేష్‌బాబు ఉన్నారు.

పర్చూరులో తెలుగుదేశం ఖాళీ



రాజుబంగారుపాలెంలో ఎస్టీ కుటుంబాలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న బాలాజీ



పోతుకట్లలో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన కార్యకర్తలు

- టీడీపీ నుంచి 236 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరిక
- పార్టీలోకి ఆహ్వానించిన అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీ

చినగంజాం: పర్చూరు నియోజకవర్గంలో ఎన్నికల సమీపిస్తున్న కొద్దీ తెలుగుదేశం పార్టీ ఖాళీ అవుతోంది. రోజురోజుకూ వైఎస్సార్ సీపీ బలం పుంజుకుంటోంది. నియోజకవర్గంలోని ప్రతిపక్ష పార్టీ టీడీపీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారు. చినగంజాం మండలం రాజుబంగారు పాలెం పంచాయతీ పరిధిలోని కుక్కల వారి పాలెం ఎస్టీ కాలనీకి చెందిన 136 కుటుంబాలు గురువారం వైఎస్సార్ సీపీలో చేరాయి. ఎమ్మెల్యే అభ్యర్థి యడం బాలాజీకి మద్దతు తెలిపాయి. సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ఆసోది బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో రాజుబంగారుపాలెం ఎంపీటీసీ అద్దూరి ఆదెమ్మ, ఆమె భర్త శింగరకొండ నాయకత్వంలో టీడీపీ కార్యకర్తలు చలంచర్ల పోలేసు, యాదగిరి ముసలయ్య, పిట్ల రామకృష్ణ, అద్దూరి సుబ్బారావు, యాదగిరి చెంచురాములు, అద్దూరి లింగయ్య, అద్దూరి రామాంజనేయులు, వెల్లంపల్లి ప్రభుదాసు, యాదగిరి ఆదిశేషు, పిట్ల వెంకటేశ్వర్లు, అద్దూరి శ్రీను, యాదగిరి శ్రీను, తుపాకుల వెంకటేశ్వర్లు, తుపాకుల శ్రీను, అద్దూరి చిన్నసుబ్బారావు, అద్దూరి బ్రహ్మయ్య, అద్దూరి పేలీను, వెల్లంపల్లి చంద్ర, అద్దూరి పవన్, ఇండ్ల శ్రీను తదితరులు పార్టీలో చేరారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభ్యర్థి యడం బాలాజీ వారికి పార్టీ కండువాలు కప్పి వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

- చినగంజాం మండల పార్టీ కన్వీనర్ మున్నం నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని రాజుబంగారు పాలెం గ్రామానికి చెందిన 100 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరాయి. పార్టీలో చేరిన వారిలో కుక్కల వెంకటేశ్వర్లు, కుక్కల శ్రీను, కుక్కల రమణారెడ్డి, మున్నం అయ్యప్ప రెడ్డి, గ్రామ కాపులు, పెద్దలు ఉన్నారు. పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో యడం బాలాజీని మర్యాద పూర్వకంగా కలిసి, శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు.

అభివృద్ధి చేశాం.. మరోసారి ఆశీర్వదించండి !



కరపత్రాలు అందించి ఓటు అభ్యర్థిస్తున్న కరణం గీత, సుధారాణి



వైఎస్సార్ సీపీ అభ్యర్థి వెంకటేష్ దంపతులకు దిష్టి తీస్తున్న మహిళలు

- ఎన్నికల ప్రచారంలో అసెంబ్లీ అభ్యర్థి వెంకటేష్ భార్య కరణం గీత
- పాల్గొన్న ఎమ్మెల్యే కుమార్తె గోరంట్ల సుధారాణి

చీరాల టౌన్: నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ, అన్ని రంగాల్లో చీరాలను అభివృద్ధి చేశామని, మరోసారి ప్రజలు ఆశీర్వదించి ఎమ్మెల్యేగా కరణం వెంకటేష్‌ను గెలిపించాలని వైఎస్సార్ సీపీ అభ్యర్థి భార్య కరణం గీత, ఎమ్మెల్యే కూతురు గోరంట్ల సుధారాణి ఓటర్లను అభ్యర్థించారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థి కరణం వెంకటేష్‌కు మద్దతుగా గురువారం వారు పట్టణంలో ప్రచారాన్ని ప్రారంభించారు. వెంకటేష్‌తో కలిసి పట్టణంలోని పలు వార్డుల్లో ఇంటింటికీ వెళ్లారు. ప్రతి ఓటరును ఆప్యాయంగా పలుకరించారు. ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో నియోజకవర్గాన్ని తన మామ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ అభ్యర్థి కరణం వెంకటేష్ ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేశారని గీత తెలిపారు. గడిచిన ఐదేళ్లలో చీరాలలో వివాదాలు లేకుండా అందరిని సమానంగా చూశామన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందరికీ అందించిన జగనన్నకు గిఫ్ట్‌గా చీరాల ఎమ్మెల్యేగా కరణం వెంకటేష్‌ను గెలిపించాలని ఆమె అభ్యర్థించారు. నియోజకవర్గ ప్రజలు ఆలోచించుకుని, అభివృద్ధి చేసి చూపించే కరణం కుటుంబానికి అండగా నిలవాలని కోరారు. మే 13న జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓట్లేసి గెలిపించాలని, ఎమ్మెల్యేగా వెంకటేష్‌ను, ఎంపీగా నందిగం సురేష్‌ను, సీఎంగా జగనన్నను గెలిపించాలని వారు కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, కౌన్సిలర్ గోలి జగదీష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

జ్యోతిరావు పూలే జీవితం ఆదర్శనీయం

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ ఈవూరు గణేష్



వేడుకల్లో డాక్టర్ గణేష్, బవుడా చైర్మన్ మల్లికార్జునరావు తదితరులు

రేపల్లె రూరల్: మహాత్మా జ్యోతిరావు పూలే జీవితం నేటి యువతకు ఆదర్శనీయమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ ఈవూరు గణేష్ అన్నారు. జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యతోనే సమాజంలోని అసమానతలను జయించటం సాధ్యమని నమ్మి ఆదిశగా వెనుబడిన జాతులను జాగృతం చేసిన సంఘ సంస్కర్త మహాత్మ జ్యోతిరావు పూలే అని తెలిపారు. అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు కృషి చేశారని చెప్పారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలు సమాన హక్కులు పొందేందుకు నిత్యం పోరాటం చేశారని గుర్తు చేశారు. మహిళా విద్యకు మార్గదర్శకునిగా బాటలు వేశారని తెలిపారు. తన భార్యతో మొదటి బాలికా పాఠశాలను ప్రారంభింపజేసి, ఎందరో మహిళల్ని విద్యావంతులుగా తీర్చిదిద్దారని చెప్పారు. అనంతరం పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి, కేక్ కట్‌చేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి, మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ, వైస్ చైర్మన్లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, వివిధ వార్డుల కౌన్సిలర్లు, కార్పొరేషన్ల డైరెక్టర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం చూసి ఓటు వేయండి !

–వేమూరు ఎమ్మెల్యే అభ్యర్థి అశోక్‌బాబు



సూరేపల్లిలో అశోక్‌బాబుకు హారతి ఇస్తున్న మహిళ

సూరేపల్లి(భట్టిప్రోలు): జగనన్న సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేసి ఆయన్ను మళ్లీ సీఎం చేయాలని వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు కోరారు. భట్టిప్రోలు మండలం సూరేపల్లిలో గురువారం ఆయన సోదరుడు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ వరికూటి అమృతపాణి, పార్టీ శ్రేణులతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలుత జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. మహిళలు హారతులు పట్టారు. అశోక్‌బాబు మాట్లాడుతూ మంచి జరిగిందంటే ఓటు వేయండి అని అడిగే దమ్మున్న నాయకుడిగా దేశ చరిత్రలో సీఎం జగన్ నిలుస్తారని తెలిపారు. ఇచ్చిన హామీలు 99 శాతం ఆయన నెరవేర్చారన్నారు. గతంలో చంద్రబాబు ఇచ్చిన హామీలకు అతీగతీ లేకుండా చేశారని విమర్శించారు. టీడీపీ, జనసేన, బీజేపీ దొంగల ముఠాగా జతకట్టి ఎన్నికల వేళ మాయమాటలు చెప్పేందుకు వస్తున్నారని, ప్రజలే వారికి తగిన గుణపాఠం చెప్పాలని ఆయన కోరారు. ప్రజలకు నిస్వార్థంగా సేవలందించే వలంటీర్లను ఒకప్పుడు గోనె సంచులు మోసే వారు, తీవ్రవాదులు అని నానా మాటలు అని కక్ష సాధించిన ప్రతిపక్షాలు ఇప్పుడు స్వరం మార్చి వారిపై కపట ప్రేమ చూపుతున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మోర్ల విజయలక్ష్మి, జేఏసీ కన్వీనర్ గోవర్ధనగిరి చినబుజ్జి, పార్టీ మండల కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, వైఎస్సార్ సీపీ నాయకులు పడమట శ్రీనివాసరావు, రావు చంద్రశేఖరరావు, పి. కిరణ్, వాకా అంకబాబు, మోర్ల సత్యనారాయణ, పడమట సాయి, గోవర్ధనగిరి పెదబుజ్జి, బండారు శ్రీనివాసరావు, మల్లోలు నాగబాబు, దావూరి నాగమల్లేశ్వరరావు, తిరువీధుల బాలాజి పాల్గొన్నారు.

దూసుకొచ్చిన మృత్యువు

- రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం
- రోడ్డుపై నిలబడ్డ వ్యక్తికి గాయాలు



ప్రమాద స్థలంలో మృతి చెందిన రేణుక



గాయపడిన గుజ్జుల శ్రీను

అద్దంకి రూరల్: బైకు మీద వెళ్తున్న భార్యాభర్తల పైకి లారీ దూసుకురావడంతో భార్య అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటన అద్దంకి పట్టణంలోని ద్వారకానగర్ వద్ద గురువారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. మండలంలోని గుర్రంవారిపాలెం గ్రామానికి చెందిన పాలపర్తి సుబ్బారావు, రేణుక (36) చేపల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఉదయం శింగరకొండ వద్ద నున్న భవనాశి చెరువులో చేపలు పట్టుకుని, అద్దంకిలోని భవాని సెంటర్‌లోని షాపులో అమ్మేందుకు బైకుమీద వస్తున్నారు. స్థానిక ద్వారకా నగర్ వచ్చేసరికి లారీ వేగంగా మలుపు తిప్పుతూ తొలుత బైకును, తర్వాత అక్కడే నిలబడి ఉన్న ముండ్లమూరు చెందిన గుజ్జుల శ్రీనును ఢీకొట్టింది. అంతటితో ఆగకుండా రోడ్డు మార్జిన్‌లో ఉన్న ట్రాక్టర్‌ను సైతం ఢీకొట్టుకుంటూ ముందుకు దూసుకుపోయింది. బైకు మీద వెనుక కూర్చున్న రేణుక అక్కడికక్కడే మృతి చెందగా భర్త సుబ్బారావుకు, మరో వ్యక్తి గుజ్జుల శ్రీనుకు స్వల్ప గాయాలయ్యాయి. లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం వల్లే ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని లారీని స్టేషన్‌కు తరలించారు. మృతురాలి భర్త సుబ్బారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ కృష్ణయ్య తెలిపారు.

పవిత్రమైనది గురుత్వం

- పీఠాధిపతులు చిన్నాబత్తిన భాగ్యయ్య
- పెదకూరపాడులో లూర్థుమాత గుహ ప్రారంభం
- వైభవంగా గురుశ్రీ సుందరరాజు గురు పట్టాభిషేకం



ప్రత్యేక దివ్య బలిపూజ నిర్వహిస్తున్న పీఠాధిపతులు చిన్నాబత్తిన భాగ్యయ్య

పెదకూరపాడు: గురుత్వం ఎంతో పవిత్రమైనదని, గురువులు క్రీస్తు ప్రతినిధులని గుంటూరు పీఠాధిపతులు రెవరెండ్ చిన్నాబత్తిన భాగ్యయ్య అన్నారు. పెదకూరపాడులోని ముగ్గురు రాజుల దేవాలయంలో లూర్థుమాత గుహను, స్థానిక విచారణ గురువులు పుట్టి సుందరరాజు 40వ గురు పట్టాభిషేక వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దివ్య బలిపూజలను పీఠాధిపతులు చిన్నాబత్తిన భాగ్యయ్య నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూబీ జూబ్లీ జరుపుకుంటున్న పుట్టి సుందరరాజుకు శుభాకాంక్షలు తెలిపారు. 40 సంవత్సరాలు పాటు గురువుగా అనేక మంది విశ్వాసులకు దేవుని సువార్తను అందించారని చెప్పారు. దేవుడు ఇచ్చిన అభిషేక వరంతో సుందరరాజు ఆయన సేవలో ముందుకు సాగాలన్నారు. గురుశ్రీ పుట్టి సుందరరాజు మాట్లాడుతూ 40 సంవత్సరాలుగా గురుత్వంలో గడపడం దేవుని ఆశీర్వాదమని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక విచారణ గురువులు కట్టా ప్రసాద్‌తో పాటు పలు విచారణ గురువులు, కన్య స్త్రీలు , సంఘ పెద్దలు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

కొండలమ్మ సేవలో గుంటూరు డీపీఓ

గుడ్లవల్లేరు: కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు మండలంలోని వేమవరం గ్రామంలో కొలువై ఉన్న శ్రీ కొండలమ్మ అమ్మవారిని గుంటూరు జిల్లా పంచాయతీరాజ్ అధికారి ఆర్.కేశవరెడ్డి గురువారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఈఓ సురేష్, చైర్మన్ శేషం గోపి ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. అమ్మవారి చిత్రపటంతో పాటు లడ్డూ ప్రసాదాలను అందించారు.

టెన్త్ పౌష్టికాహార బిల్లుల చెల్లింపులు

- ఉమ్మడి గుంటూరు జిల్లాకు రూ.61.20 లక్షలు మంజూరు చేసిన జెడ్పీ
- మూడు జిల్లాల డీఈవోల ఖాతాలకు నిధులు జమ
- 27,201 మంది విద్యార్థులకు లబ్ధి

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు రాసిన విద్యార్థుల పౌష్టికాహారానికి సంబంధించిన నిధులను విడుదల చేసిన జిల్లా ప్రజా పరిషత్, పాఠశాలల వారీగా ప్రధానోపాధ్యాయులకు చెల్లింపులు జరుపుతోంది. టెన్త్ విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు ముందస్తుగా తమ సొంత నిధులను ఖర్చు చేసిన హెచ్‌ఎంలకు మొత్తాన్ని చెల్లించే విధంగా మూడు జిల్లాల డీఈవోల ఖాతాల్లో నిధులు జమయ్యాయి. గత మార్చిలో జరిగిన టెన్త్ పబ్లిక్ పరీక్షలకు ముందుగా ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని 400 ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్ ఉన్నత పాఠశాలల నుంచి సన్నద్ధమైన 27,201 మంది విద్యార్థులకు సాయంత్రం వేళల్లో బలవర్ధకమైన పౌష్టికాహారాన్ని అందించేందుకు జెడ్పీ నుంచి రూ.61,20,225 నిధులు మంజూరు చేశారు. ఒక్కో విద్యార్థికీ రోజుకు రూ.7.50 చొప్పున కేటాయించిన నిధులతో 30 రోజుల పాటు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అల్పాహారాన్ని అందించారు. ఈ విధంగా గుంటూరు జిల్లా పరిధిలోని 144 హైస్కూళ్లలో 9,686 మంది విద్యార్థులకు సంబంధించి రూ.21,79,350, పల్నాడు జిల్లాలోని 176 హైస్కూళ్లలో 13,205 మంది విద్యార్థులకు రూ.29,71,125, బాపట్ల జిల్లాలోని 80 హైస్కూళ్ల పరిధిలో 4,310 మంది విద్యార్థులకు సంబంధించి, అల్పాహారానికి ఖర్చు చేసిన నిధులను రీ-యింబర్స్ చేస్తూ గతంలోనే జెడ్పీ సీఈవో ఎన్వీబీఎస్ వసంతరాయుడు ఉత్తర్వులు విడుదల చేశారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల వారీగా సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు పంపిణీ చేసిన అల్పాహారానికి సంబంధించిన నిధుల వినియోగ ధ్రువపత్రాలను సమర్పించి, నిధులను పొందాలని సూచించారు. ప్రస్తుతం మూడు జిల్లాల పరిధిలో హెచ్‌ఎంలు సంబంధిత నిధులు పొందేందుకు నిధుల వినియోగ వివరాలు సమర్పిస్తున్నారు. కాగా టెన్త్ విద్యార్థులకు జెడ్పీ నిధులతో వరుసగా రెండేళ్ల పాటు అల్పాహారం అందజేశారు.

మేనకోడలి ముఖంపై మేనమామ కత్తితో దాడి



సత్తెనపల్లి: మేనకోడలి ముఖంపై కత్తితో వ్యక్తి దాడి చేసిన సంఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని 10వ వార్డులో గురువారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని 10వ వార్డుకు చెందిన సరిత అనే యువతిపై మేనమామ శిఖా వెంకటేష్ కత్తితో ముఖంపై దాడి చేశాడు. దీంతో ఆమె ముఖం రక్తస్రావమైంది. బాధితురాలిని చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించగా ప్రాథమిక చికిత్స చేసి గుంటూరుకు రిఫర్ చేశారు. కళ్ల సమీపంలో కత్తితో దాడి చేయడంతో కళ్లకు ప్రమాదం వాటిల్లే అవకాశముందని వైద్యులు తెలిపారు. కాగా గత 15 రోజుల క్రితం కుటుంబ కలహాల నేపథ్యంలో వెంకటేష్ కుటుంబ సభ్యులపై పోలీసులకు ఆమె ఫిర్యాదు చేసింది. తమ పైనే ఫిర్యాదు చేస్తావా ? అంటూ వెంకటేష్ కత్తితో దాడి చేసి గాయపరిచినట్లు బాధితురాలు తెలిపింది. దీనిపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.